క్లుప్తంగా

పొగతాగడం హానికరం

న్యాయమూర్తి రేవతి



ప్రతిజ్ఞ చేస్తున్న రేవతి, సిబ్బంది

హుస్నాబాద్: పొగతాగడం హానికరమని దానికి దూరంగా ఉండాలని న్యాయమూర్తి బి.రేవతి పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కోర్టు హాల్‌లో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ పొగతాగడం వల్ల క్యాన్సర్, గుండెపోటు, రక్తపోటు లాంటి వ్యాధుల బారిన పడతారన్నారు.

తహసీల్దార్‌గా సలీమ్



చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక తహసీల్దార్‌గా ఎండీ సలీమ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ హరి కిరణ్ సిద్దిపేట అర్బన్‌కు బదిలీ అయ్యారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏగొండ అన్నారు. 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులను అందిస్తున్నారన్నారు. నాయకులు శివకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకుగా చూడొద్దు



మాట్లాడుతున్న రాజునాయక్

హుస్నాబాద్: రాష్ట్ర జనాభాలో పది శాతం ఉన్న లంబాడీ సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుగా చూడొద్దని, త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో తమకు స్థానం కల్పించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వకుండా అవమానపరుస్తున్నారన్నారు. నాయకులు రాంచంద్ర నాయక్, సత్యం నాయక్, కృష్ణ నాయక్, మోతీలాల్ నాయక్, తిరుపతి నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు



జీలుగ విత్తనాల కోసం రైతుల పాట్లు

మిరుదొడ్డి(దుబ్బాక): అధికారులు జీలుగ విత్తనాల సరఫరాలో నిర్లక్ష్యం తగదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అల్వాల చెప్యాల క్రాస్ రోడ్డు వద్ద రైతులు శనివారం మాట్లాడారు. జీలుగ విత్తనాల కోసం ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నామని, చాలీ చాలని విత్తనాలు అందించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. కావాల్సిన విత్తనాలను సరఫరా చేయకపోడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేయాలని కోరారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని శాస్త్రవేత్తలు ప్రతాప్‌రెడ్డి, శివరాం, షాలిని సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చాట్లపల్లి, బస్వాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి నమూనా వల్ల ఎన్నో లాభాలున్నాయన్నారు. రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. వ్యవసాయరంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు కిరణ్, భాను, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

‘వరి’వైపు.. రైతుల చూపు



కోహెడలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు

ముందస్తుగా కురుస్తున్న వర్షాలు

- రోహిణి కార్తెలో పెరుగుతున్న విస్తీర్ణం
- సాగు అంచనా 23,500 ఎకరాలు
- అన్నదాతల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- పనుల్లో నిమగ్నమైన రైతులు

కోహెడ(హుస్నాబాద్): ఈ వానాకాలం వరి సాగుపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. రోహిణి కార్తె ఆరంభానికి ముందు నుంచే వర్షాలు కురవటంతో సాగు విస్తీర్ణం ఘణనీయంగా పెరగనుందని అంచనా. మండల వ్యాప్తంగా సుమారు 23,500 ఎకరాలలో వరి సాగు కానుందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే రైతులు నారుమళ్లు సిద్ధం చేయటంలో నిమగ్నమయ్యారు.

పెరుగుతున్న భూగర్భ జలాలు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ, బోరు బావులల్లో నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వాతావరణశాఖ అందిస్తున్న సమాచారం మేరకు నైరుతి రుతుపవనాలు నెల రోజుల ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించాయి. దీంతో ముందుగా వర్షాలు సమృద్ధిగా కురవనున్నట్లు తెలుస్తుంది.

విరివిగా వరిసాగు విస్తీర్ణం

కురుస్తున్న భారీ, తేలికపాటి వర్షాలతో సాగు విస్తీర్ణం ఘణనీయంగా పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. పక్షం రోజుల క్రితం నుంచి వర్షాలు కురవటంతో చాలామంది రైతులు రోహిణి కార్తె ఆరంభం నుంచే నాట్లు కోసం నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.

సాగు వివరాలు:	
పంట	విస్తీర్ణం
వరి	23,500 ఎకరాలు
పత్తి	6,500 ఎకరాలు
మొక్కజొన్న	650 ఎకరాలు
ఇతర పంటలు	200 ఎకరాలు
విత్తనాలు	వివరాలు
వరి	4,500 క్వింటాళ్లు
మొక్కజొన్న	52 క్వింటాళ్లు
కందులు	10 క్వింటాళ్లు
పత్తి	16,250 ప్యాకెట్స్
ఎరువులు	వివరాలు
యూరియా	3,500 మెట్రిక్ టన్నులు
కాంప్లెక్స్	2,300 మెట్రిక్ టన్నులు
పొటాష్	1,550 మెట్రిక్ టన్నులు
డీఏపీ	900 మెట్రిక్ టన్నులు

ఐదెకరాలు వరిసాగు చేస్తున్న..



రెండెకరాలలో వరినాట్లు వేస్తున్న. గత యేడాది నీళ్ల లేక మొక్కజొన్న సాగు చేసిన. పంటకు ఎక్కవ సార్లు పురుగు మందులు పిచికారీ చేయడంతో లాభం రాకుండా పోయింది. ఇప్పుడు వర్షాలు మంచిగానే పడుతున్నాయి. బావిలో నీటి ఊటలు పెరుగుతున్నాయి. ఐదు ఎకరాలకు సరిపడా నీళ్లు ఉన్నాయి. ముందు ముందు ఇంకా వర్షాలు కురుస్తాయని వార్తలు వస్తున్నాయి. సంతోషంతో వరి సాగుకు సిద్ధమయ్యాను.

– గడ్డం ఆదిరెడ్డి, రైతు కోహెడ

వానాకాలం సాగుకు సర్వం సిద్ధం



రోహిణి కార్తె ఆరంభానికి పక్షం రోజులు ముందు నుంచే వర్షాలు కురుస్తున్నాయి. రైతులు పత్తి, మొక్కజొన్న, వరి సాగుకు సిద్ధమయ్యారు. దీంతో వానాకాలం సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాం. నారుమళ్ల సంరక్షణకు సలహాలు, సూచనల కోసం గ్రామాలలో విస్తరణాధికారులను నియమించాం. పాయలుగా నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని. దీంతో గాలి తగిలి చీడపీడల బారిన పడకుండా పైరు ఏపుగా పెరుగుతుంది.

– సతీశ్, ఏఓ కోహెడ

సర్కారు బడులను బలోపేతం చేద్దాం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీఅహ్మద్

చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచారజాత శనివారం చిన్నకోడూరు, బెజ్జంకికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమాలలో సంఘం ప్రతినిధులు యాదగిరి, కృష్ణ, కనకరాజు, రాకేశ్, కృష్ణ, శ్రీను, రమేశ్, సీపీఎం నేతలు శ్రీనివాస్, ఎల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని దుద్దెడలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడాది అన్ని ప్రభుత్వ పాఠశాల్లోను ఆంగ్లమాధ్యమ బోధన అందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో మహాదేవ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేత కుమార్, హెచ్‌ఎం బాలయ్య, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో మాట్లాడుతున్న షేక్ వలీఅహ్మద్

అదనపు భారం వేసుకోవద్దు

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు పంపించి అదనపు భారాన్ని నెత్తిన వేసుకోవద్దని ఎంఈఓ బచ్చలి సత్తయ్య తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని ముద్దాపూర్‌లో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశ అవకాశాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి సంధ్యారాణి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాచగిరి ఈఓగా విజయరామారావు



విజయరామారావు

వర్గల్(గజ్వేల్): నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వి.విజయరామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన విశ్వనాథశర్మ శనివారం ఉద్యోగ విరమణ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, ముర్షద్‌గడ్డ, గణేశ్‌నగర్, గ్రీన్‌హౌస్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, ఏకలవ్యనగర్, న్యూ సాయినగర్, సాయిబాబా ఆలయ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సిద్దిపేటఅర్బన్‌లో..

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఎన్సాన్‌పల్లి, ఎన్సాన్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియా, మిట్టపల్లి, మిట్టపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, మందపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

జీలుగకు బదులుగా నవధాన్యాలు



నవధాన్యాల మినీ ఫ్యాకెట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వానాకాలం సాగు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జీలుగ విత్తనాల కొరతను అధిగమించడానికి గాను నవధాన్యాల మినీ ఫ్యాకెట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లాలో జీలుగ విత్తనాల సరఫరాలో కొంతమేర ఆలస్యం అవుతోంది. ఇప్పటికే జిల్లాలో రెండు వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీతో అందించారు. అయినప్పటికీ ఇంకా విత్తనాల కొరత వెంటాడుతోంది. దీంతో జీలుగ విత్తనాలకు ప్రత్యామ్నాయంగా నవధాన్యాల మినీ ప్యాకెట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నవధాన్యాల ప్యాకెట్ ఐదు కిలోలు ఉంటుంది. జీలుగ విత్తనాల ధరతో సమానంగా ఉంది. దీనిలో జనుము, పిల్లిపెసర, ఉలువలు, మొక్కజొన్న, జొన్న, బెండ, జీలుగ, బొబ్బర్లు, గోరు చిక్కుడు విత్తనాలు ఉన్నాయి. ఇవి కూడా జీలుగా విత్తనాల లాగానే నేలలో నత్రజని పెంచుతాయని, త్వరలోనే రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ పద్మ శనివారం తెలిపారు.

కబ్జా చేసిన వారిపై చర్యలేవీ?


మిరుదొడ్డి(దుబ్బాక): స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా దారిని కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెల అంజయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దెల సుదర్శన్ డిమాండ్ చేశారు. స్థానిక బీసీ కాలనీకి అనుసంధానంగా ఉన్న దారిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని స్థానికులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 యేళ్ల క్రితం ఏర్పాటు చేసిన దారిని కబ్జా చేశారని, ఆందోళనకు దిగిన వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దారిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని, స్థానికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాములు, నర్సింహులు, మల్లేశం, స్థానికులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన సీఐ

దౌల్తాబాద్(దుబ్బాక): పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మద్‌నగర్‌లో శనివారం తొగుట సీఐ లతీఫ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

హుస్నాబాద్‌రూరల్/ములుగు(గజ్వేల్): వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు మూడు నెలలకు గాను ఒకేసారి బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రేషన్ దుకాణాలకు బియ్యం రవాణా చేసినట్లు తహసీల్దార్ లక్ష్మారెడ్డి చెప్పారు. రేషన్ డీలర్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి బియ్యం పంపిణీపై సూచనలిచ్చారు. 24 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేశామని. ఆదివారం నుంచి పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ రుక్మిణీరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ములుగులో తహసీల్దార్ ఆరీఫా సమావేశం నిర్వహించారు. రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై 3వ తేదీ నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్: డీలర్లతో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు: సీఐ

దౌల్తాబాద్(దుబ్బాక): రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన ఎరువులు, విత్తనాల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి డీలరు తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి సత్య అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రజల్లో స్నేహభావం



ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో స్నేహభావం పెంపొందుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కుకునూరుపల్లిలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా పండితులు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుల సంఘాలు, ఆలయాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేస్తూ ఆధ్యాత్మికతను పెంచిందన్నారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిమను అందజేశారు. మహిళలు హరీశ్‌రావుతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఆయనతో పాటు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షురాలు దేవి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఇతర నాయకులు కుమార్, ఐలయ్య, కిరణ్‌కుమార్‌చారి, శ్రీనివాస్, మహిపాల్, సంపత్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరం సుభిక్షంగా ఉండాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రామ దేవతల ఆశీస్సులతో అందరం సుభిక్షంగా ఉండాలని హరీశ్‌రావు అన్నారు. లింగారెడ్డిపల్లిలో శనివారం వన దుర్గాదేవి, పెద్దమ్మ, మహంకాళి అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠ, వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి

సిద్దిపేటజోన్: పేద కుటుంబాలు, విద్యార్థులకు నూతన కార్యవర్గం అండగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పద్మశాలీ సమాజం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాజనర్స్, వేణుగోపాల్‌రెడ్డి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు చేసిన గొప్ప పార్టీ సీపీఐ

జిల్లా కార్యదర్శి పవన్

చేర్యాల(సిద్దిపేట): పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసిన గొప్ప పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. పట్టణ కేంద్రంలో శనివారం 13వ మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయం నుంచి షాదీఖాన వరకు పార్టీ, అనుబంధ సంఘ నాయకులు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, అరిగే కావ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పవన్ మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలోని ప్రజా సమస్యలపై, రాజకీయ నాయకుల అవినీతి అక్రమాలపై సీపీఐ పోరాడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మమత, యాదగిరి, బాలుమోహన్, నర్సింహాచారి, జనార్దన్, నరేశ్, కనకయ్య, భూమయ్య, సుదర్శన్, పరమశేఖర్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పవన్

చిత్తశుద్ధి, అంకిత భావంతోనే గుర్తింపు



వర్గల్(గజ్వేల్): ప్రభాకర్‌ను సన్మానిస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): చిత్తశుద్ధి, అంకిత భావంతో విధులు నిర్వహించిన అధికారులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని పంచాయతీరాజ్ సీఈ జోగారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వర్గల్‌లో శనివారం నిర్వహించిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్ ఉద్యోగ విరమణ అభినందన సభలో వారు పాల్గొని ఘనంగా సన్మానించారు. నాణ్యతలో రాజీపడని అధికారిగా ప్రభాకర్ ప్రజల మెప్పు పొందారని ప్రశంసించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రభాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ నరేందర్‌రెడ్డి, ఈఈ చిరంజీవిచారి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీఓ మచ్చేందర్, రంగారెడ్డి, లత, మోహన్, బాలూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తయ్య ఉద్యోగ విరమణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన సత్తయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని మాట్లాడారు. సత్తయ్య నిర్వహించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, భాస్కర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్ ర్‌ఖాన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శిని బదిలీ చేయాలని వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని మర్రిముచ్చాల పంచాయతీ కార్యదర్శి రాజమణిని బదిలీ చేయాలని గ్రామస్తులు కలెక్టర్, ఎంపీడీఓలకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వారం రోజులకొకసారి చెత్త సేకరణ నిర్వహిస్తున్నారని, వారానికి రెండు రోజులు చెత్త సేకరణ చేపట్టాలని కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. ఏదైనా పనికోసం కార్యాలయానికి పోతే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి కార్యదర్శిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంశీ, యాదయ్య, నర్సింగరావు, భిక్షపతి, కిరణ్, కృష్ణారెడ్డి, గాలయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ శ్రీనివాసవర్మకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయండి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక): సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేరేచోటుకు తరలించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేయడం దారుణమన్నారు. పదిమంది లోపు ఒక్క ఉపాధ్యాయుడు, 11 నుంచి 60 వరకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని ఆదేశించడం సబబు కాదన్నారు. అదేవిధంగా మిరుదొడ్డిలో టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాకం మల్లేశం, మండలశాఖ అధ్యక్షుడు అందె రామచంద్రం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేస్తుంటే, పాఠశాలల ప్రారంభానికి ముందే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలా చేరుతారని ప్రశ్నించారు. 90 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు ఎలా బోధించగలరని వాపోయారు. సర్దుబాటు విషయంలో ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.